
కథ



# తెలుగువారందరం...

వడ్డాలపు ప్రభాకర్

*(గత సంచిక తరువాయి)*

**కా**ర్పొరేట్ కంపెనీలో ఉద్యోగం దొరకడం, పదోన్నతులపై పదోన్నతులతో, రాష్ట్రస్థాయి వ్యవహారాలు చూసే ముఖ్యకార్య నిర్వహణాధికారిగా ఇప్పుడు బాధ్యతలు నిర్వహించే స్థాయికి ఎదిగి పోయా. నా కార్యాలయంలోనూ అందరూ తెలుగే మాట్లాడాలని హుకుం జారీ చేశా. ఉత్తరప్రత్యుత్తరాలు తప్ప, మాట్టాడడం అంతా తెలుగే. ఎంతో సంతృప్తిగా ఉన్న నాకు, అనుకోని చిక్కొచ్చి పడింది. అది తేలికగా తీసుకునేది కాదు.

మా సంస్థ చైర్మన్ పిలిచి, "నా కోసం మీరీ పని చేసిపెట్టాలి" అనడాన్ని, మదిలో నుంచి ఎంత తీసేసుకుందామనుకున్నా, అది పోవడం లేదు. అమెరికా బేస్డ్ సంస్థతో మాట్లాడి, వ్యాపారపు ఒప్పం దాన్ని కుదుర్చుకునేందుకు, భారతదేశవ్యాప్తంగా ఉన్న తమ శాఖ ల్లోంచి అత్యంతసమర్థుడుగా నన్ను గుర్తించి, ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ నేను అంగ్లపదాన్ని ఉచ్చరించి పాతికేళ్లు గడిచిపోయాయని చెప్పగానే, "నా కోసం మీరు ఈ పని చేసిపెట్టాలి" అని చైర్మన్ మళ్లీ అనడం, ఏమీ పాలుపోని స్థితిలోకి నెట్టేసింది. ఆయన నా సంస్థకు యజమానే కాదు. పాతికేళ్లుగా నేనూ, నా కుటుంబం పట్టెడు అన్నం మెతుకులు తింటున్నామంటే, అది ఆయన భిక్షే. ఈ రోజున మెర్సిడెజ్ బెంజ్ కార్లో నేనూ, స్కోడా కారులో మా అబ్బాయీ, రోడ్ల పైన తిరగగలుగుతున్నామంటే, అది ఆ సంస్థ నుంచి పొందిందే. నేను సంస్థకు ఎన్ని సేవలు చేసినా, ఆర్థికవిషయాల రీత్యా ఆలోచించినప్పుడు, ఎంతో ఋణపడి ఉన్నా ననిపించేది. ఆయన కోరితే నా ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడేది. అప్పట్లో నా మనసు. కానీ ఆయన కోరింది, నా ప్రాణాని కంటే ఎక్కువైన ఆత్మాభిమానాన్ని చంపుకోమని. ఎలా చేయగలను? ఆత్మాభిమానం చంపుకున్నాక 'నేనెవరు?' అని ప్రశ్నించుకుంటే ఇంకేముంటుంది? శూన్యం! అని ఆలోచించినా, ఇన్నాళ్ల ఈ జీవి తం, ఈ సంతృప్తి అంతా నా సంస్థ అందించిందే కదా-అని ఆలో చించాల్సివచ్చింది.

విషయాన్ని మా ఆవిడతో చెబుతూ కాస్త తల్లడిల్లిపోయా.

"మీ యజమాని కోరికలో తప్పులేదని నా ఉద్దేశం. అది వారికి కోట్లు సంపాదించి పెట్టవచ్చు. కానీ మనం ఈ రోజు ఈ స్థితిలో ఉన్నామంటే, వారు బాగుండబట్టే కదా. ఆత్మాభిమానం చంపు కోమని నేను చెప్పడం లేదు. యజమాని చెప్పిన పని చేశానా, లేదా-అని ఆలోచించుకోండి" అని సలహా ఇచ్చింది.

ఇక ఎక్కువగా ఆలోచించదలుచుకోలేదు. రెండు నెలల్లో అనర్గళంగా ఆంగ్లం మాట్లాడా లని నిర్ణయించుకుని, ఆ విషయాన్ని మా చైర్మన్ గారికి చెప్పా. ఆయన ఆనందానికి అవధులు లేవు. అమెరికా సంస్థతో వ్యాపారపు ఒప్పందం కుదిరినదానికంటే ఎక్కువగా ఉప్పొంగిపోయారు.

ఆయన కుర్చీ లోంచి లేచి వస్తూ, "మీ ఆత్మాభిమానాన్ని దెబ్బ తీయాలని కాదు. మీరంటే ఎందుకో నాకు కొండంత నమ్మకం" అని ఆలింగనం చేసుకుని, ఆల్ ది బెస్ట్ చెప్పి, బయటికి వెళ్లిపోయారు.

000

రెండు నెలలు గడిచిపోయాయి. రాత్రీ, పగలూ తేడా, లేకుండా మళ్లీ ఎబిసిడిల నుంచి అమెరికన్ యాస వరకు అన్నీ నేర్చుకున్నా. పట్టుదల ఉంటే సాధించలేనిది లేదనడానికి, ఈ రెండు నెలలూ కూడా ముఖ్యమైనవే. అనుకున్న రోజు రానే వచ్చింది. మా అబ్బాయి అమెరికా పయనమైన మరుసటి రోజే, నేను ఫ్లైట్ ఎక్కాల్సిరావడం ఎంతో సంతృప్తినిచ్చింది.

000

మూడు రోజుల పాటు తానా సభలు జరుగుతాయని మా అబ్బాయి చెప్పిన మాటలు, న్యూ యార్క్‌లోని ఓ స్టార్ హోటల్ కారిడార్‌లో తిరుగుతున్న నాకు, గుర్తుకు వచ్చాయి. అది నా ట్రిప్‌లో రెండవ రోజు. మా అబ్బాయి ప్రసంగం ఆ రోజు

ఉంటుంది. మాకు యాభై కిలోమీటర్ల దూరంలోనే తానా సభలు జరుగుతున్నాయి. ఆ విషయం తెలిసినా, నేను వచ్చిన పని తాలూకు చర్చలు ఒక కొలిక్కి రాలేదు. సభలకు వెళ్లలేకపోతున్నానే అన్న బాధ ఉన్నా, నేను వచ్చింది కంపెనీ కోసమని మనసును సముదాయించుకుని, మళ్లీ మీటింగుకు హాజరయ్యా. చర్చలు సఫలమయ్యాయి. వేల కోట్ల రూపాయల ప్రాజెక్టు, ఓకే అయింది. ఆ ఆనందంలో మా అబ్బాయి గురించి మరిచిపోయా.

ఇండియాకు ఫోన్ చేసి మా ఛైర్మన్‌కు విషయం చెప్పా. ఎదురుగా ఉంటే నన్ను ఎత్తుకుని ముద్దుపెట్టుకునేవాడినంటూ ఆయన ఆనందంగా అన్న మాటలు, నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఆ రోజు రాత్రి డిమ్ లైట్ల వెలుతురులో జరిగిన పార్టీలో వైన్ తీసుకుని, రూంకు చేరుకోగానే బెడ్‌పై వాలిపోయా.

000

రూంలోకి వచ్చిన పేపర్ చూసి ఒక్కసారిగా నివ్వెరపోయా. ఫేమస్ డెయిలీ న్యూ యార్క్ టైమ్స్‌లో బ్యానర్ ఐటం. హెడ్డింగ్ కింద పెద్ద ఫోటో. ఒళ్లంతా తెలిపోయినట్లయింది. చాలా ఎగ్జయి టింగ్‌గా వుంది నాకు. గుండె ఎలా కొట్టుకోవాలో తెలియక తల్ల డిల్లుతోంది. చేతుల్లో ఏదో తెలియని వణుకు!

మా అబ్బాయి ఫోటో ఒక ఇంగ్లీష్ డెయిలీలో అలా వస్తుందనీ, అదీ అమెరికాలో, కలలో కూడా ఊహించ లేదు. చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. "మదర్ టంగ్ ఈజ్ మదర్" అనే హెడ్డింగ్. సేస్ వన్ కామన్ మ్యాన్.. అండ్ ప్రూవ్డ్ ఇట్ అనే డెక్‌తో సాగింది ఆ ఐటమ్. "మాతృభాషా సంరక్షణలో మొక్కవోని దీక్షతో ప్రపంచ జనావళికి కొత్త నిర్వచనా న్నిచ్చిన ఆ యువకుడు అనిరుద్ధ్‌ను ఎలా పొగడాలో, ఎ టు జడ్‌లోనే ఎన్నో లక్షల పదాలు సృష్టించిన అమెరికన్‌నైన నాకు అర్థం కావడం లే"దంటూ, ఓ రిపోర్టర్ మనస్ఫూర్తిగా అభినందిస్తూ, రాశాడు ఆ వార్తను. దానికి అంతే రీతిలో ప్రాధాన్యమిచ్చారు, ఆ పత్రికలో.

నా ఆనందాన్ని ఎలా వర్ణించాలో కూడా తెలియని అయోమయ స్థితి. ఆ రోజు ఉదయమే నా ఫ్లైట్ టైమ్ అవుతుందనడంతో పేపర్ బ్యాగులో సర్దుకుని ఇండియా రావడానికి ఎయిర్ పోర్టుకు చేరున్నా.

000

ఇండియాకు వచ్చిందే తడవు, మా అబ్బాయి ఫోటో ఉన్న పత్రికను కనిపించినవారికల్లా చూపిస్తూ, చిన్నపిల్లాడిలా ఎంతో సంబరపడిపోయా.

మా ఆవిడైతే, "బంగారం లాంటి కొడుకు నిచ్చావయ్యా!" అంటూ బిగ్గరగా కౌగిలించుకుని, ఓ గంటపాటు కన్నీళ్ల స్నానం చేయిం చింది. నేనూ అంతే!

000

మా అబ్బాయిని రిసీవ్ చేసుకోవడానికి ఎయిర్ పోర్ట్‌కు వెళ్లాం, చాలామందిమే. వాడు వస్తూనే నా కాళ్లపై, నా భార్య కాళ్లపై పడి పోయాడు. ఇప్పుడూ మళ్లీ కన్నీళ్లే అందరి కళ్లలో సుడులు తిరి గాయి.

కానీ అతడు చాలా నిర్భావంగా ఉన్నాడు. "ఎలా ఉన్నావ్ నాన్నా?" అని గుండెల పైకి తీసుకుని అడిగినా, ఒక్క మాట కూడా మాట్లాడలేదు. టైర్డ్ అయి ఉంటాడనుకుని నేను కూడా డిస్టర్బ్ చేయలేకపోయాను. ... ఆ విడే ఏమీ అనలేదు. వాడి గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. రాత్రి భోజనం అన్నా వద్దన్నట్లుగా సైగ చేశాడే కానీ, ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

000

"వాట్ ఈజ్ దిస్ నాన్‌సెన్స్..? ఇ...ా ఎక్కడైనా వుందా? సన్మాన గ్రహీత ముందు మాట్లాడడమేంటి? ఇంత ఖర్చుపెట్టి.. ఛీ...ఛీ... ఏయ్.. ఎవరయ్యా అప్పాయింట్ మెంట్ అప్పాయింట్ మెంట్ అంటూ ఆయన చుట్టూ తిరిగింది? ఆయన డిమాండ్లన్నీ ఒప్పుకున్నాం కదా! ప్రెస్ కవరేజ్ ఓకే. టీవీల్లో లైవ్ అన్నాడు. సాధ్యమైనన్ని ఛానళ్లను ఒ...ప్పించా... అంతా బాగానే ఉంది...ఆయన ముందు మాట్లాడితే సభలో ఎవడైనా ఉంటాడా? తర్వాత వాళ్ల సంగ తేంటి? ఇదే ...షా మాషీ ప్రోగ్రాం కాదు. ఎన్ ఆర్ఐ ఫండ్స్‌తో చేస్తున్న సన్మానం. మన తెలుగు జాతి గొప్ప దనాన్ని ప్రపంచానికి చాటాడని తెలుగు గడ్డపై సన్మానం చేస్తే, చాలామందికి ఇన్‌స్పిరేషన్‌గా ఉంటుందని చేస్తున్నాం. ఆ... వ రా ట్లా డె ైదె నా మాట్లాడతాడంటనా...? శాలువా కప్పాక కృతజ్ఞతలు చెప్పేసి జై హింద్ అంటా డటనా?" ఆగ్రహంతో ఊగిపోతూ చిందులు తొక్కుతున్నాడు సభ ఆర్గనైజర్.

అది, మా అబ్బాయి సుశ్రుత్ సన్మానసభ. ముందు వరుస లోనే కూర్చుని వుండడంతో అతని మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి నాకు... హుం... తెలుగు తెలుగంటూ ఎన్ని ఇంగ్లీష్ పదాలు వాడాడో... అంత గొప్పగా వుంది అతని భాషాభిమానం!

"మదర్ టంగ్ ఈజ్ మదర్" అనే హెడ్డింగ్. సేస్ వన్ కామన్ మ్యాన్.. అండ్ ప్రూవ్డ్ ఇట్ అనే డెక్‌తో సాగింది ఆ ఐటమ్. "మాతృభాషాసంరక్షణలో మొక్కవోని దీక్షతో ప్రపంచ జనావళికి కొత్త నిర్వచనా న్నిచ్చిన ఆ యువకుడు అనిరుద్ధ్‌ను ఎలా పొగడాలో, ఎ టు జడ్‌లోనే ఎన్నో లక్షల పదాలు సృష్టించిన అమెరికన్‌నైన నాకు అర్థం కావడం లే"దంటూ, ఓ రిపోర్టర్ మనస్ఫూర్తిగా అభినందిస్తూ, రాశాడు ఆ వార్తను. దానికి అంతే రీతిలో ప్రాధాన్యమిచ్చారు, ఆ పత్రికలో.


ఒళ్లంతా నీరసంతో, నిస్సత్తువగా ఉన్నా, వచ్చినప్పటి నుంచీ నాకు ముఖం చూపించక తిండీ తిప్పలు లేక, వారం రోజులూ ఇంట్లోనే గడిపి, చివరకు సన్మానం పేరుతో బయటి ప్రపంచంలోకి వస్తున్న నా పుత్రరత్నాన్ని సభా వేదిక పైనైనా కాస్సేపు తనివితీరా చూసుకోవచ్చని ముందే వచ్చి కూర్చున్నాన్నేను. ఏవేవో తెలియని ఆలోచనలు. ఒక్కసారిగా హడావుడి మొదలైంది. నిర్వాహకుల్లో కొందరు ప్రధానద్వారం వద్దకు వెళుతుండడంతో, సుశ్రుత్ వస్తున్నాడని, నేను కూడా వెళ్లా, ఓ అనామకుడిలా.

కారు దిగుతూనే సాయం కోసమన్నట్లు ఓ వ్యక్తి వైపు చూశాడు. నీరసంగా ఉన్నాడు సుశ్రుత్. వచ్చినప్పటి నుంచి అమ్మానాన్నల ముఖం గాని, అన్నం ముఖం గాని చూసిన పాపాన పోలేదు. ఊతంగా నిల్చుంటావాడని నేనే ముందుకు వెళ్లి మా అబ్బాయి చేయి తీసుకొని భుజంపై వేసుకోబోయా. ఏదో తెలియని వైరాగ్యంతో నా ముఖంలోకి చూస్తూ అక్కర్లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

నాతో మాట్లాడ్డం మా అబ్బాయికి అప్పటికీ ఇష్టం లేదని అర్థమైపోయింది. నేను చేసిన తప్పేంటో ఎంత తర్కంతో ఆలోచించినా, నా బుర్రను తాకడం లేదు.

000

అందరూ నిశ్శబ్దంగా వున్నారు. మా అబ్బాయి ముఖంలోని నీరసాన్ని గురించిన నేను మాత్రమే గమనించాను. సుశ్రుత్ మాట్లాడడం ఆరంభించాడు. వాడి నోటి పలుకులు వినాలన్న ఉబలాటంతో, కుర్చీ...ంచి నాకు తెలియకుండానే కాస్త ముందుకు జరిగి కూర్చున్నా.




"సభకు, సభాసదులందరికీ నమస్కారం. ముందు నన్ను మన్నించాలి. ఇక్కడి నిర్వాహకులను చాలా ఇబ్బంది పెట్టాను. వారి పట్టుదల ముందు నేను పెదవి విప్పక తప్పలేదు. భాష గురించి నాకు తోచిన నాలుగు ముక్కలు మాట్లాడతాను. తప్పు మాట్లాడితే పెద్దలు, పిన్నలు మన్నించాలి... మీరు మన్నిస్తానంటేనే, మాట్లాడమంటేనే మాట్లాడతాను..." అనుమతి కోసమన్నట్లుగా సభాసదులను చూస్తున్నాడు సుశ్రుత్.

"మాట్లాడండీ... మాట్లాడండీ...!" అందరూ ముక్తకంఠంతో అన్నారు.

మళ్లీ మాటలు ఆరంభించాడు సుశ్రుత్. "దేశాభిమానము నాకు కద్దని వట్టిగొప్పలు చెప్పుకోకోయ్.. పూని ఏదైనాను ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్.. దేశభాషలందు తెలుగు లెస్స...' ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి... ఇందులో మా నాన్నగారికి ఏది స్ఫూర్తినిచ్చిందో తెలియదు గాని, నన్ను తెలుగు ఉచ్చులో బిగించింది..." మా అబ్బాయి ఇన్ని రోజులూ నాతో ఎందుకు మాట్లాడలేదో ఇట్టే అర్థమైపోయింది. ఇంకా ఏం వినాల్సివస్తుందోనని గుండెను చిక్కబట్టుకొని అలాగే చూస్తున్నా, వింటున్నా.

"భాష, భావవ్యక్తీకరణకు అద్భుతమైన సాధనం. హావభావాలతో కొన్ని విషయాలు చెప్పగలిగినా అన్ని విషయాలూ చెప్పలేం. మనిషికే భాషుందని అంటుంటారు. ప్రతి జీవికీ భాష ఉంది. అంబా అన్న అరుపులో అర్థాన్ని... ఆవేదనని అర్థం చేసుకోగలదు తల్లిగోవు. అలాగే ప్రతిజీవి కూడా. వాటికి పరభాషల సంపర్కం లేదు కాబట్టి అవి ఏ చీకూ, చింతా లేకుండా ఉన్నాయి. ఎన్నో భాషల సంగమం మన భారతావని. లిపి లేని భాషలు, లిపి ఉన్న భాషలు... అచ్చంగా తెలుగు పుట్టి కొట్టిందా అంటే అదీ లేదు. సంస్కృతం అన్ని భాషలకూ మాతృక అయినప్పుడు మన సంస్కృతిలో ఇప్పుడు చోటే లేకుండా చేశాం మనం!

"తప్పెవరిదంటే నెపం కాలం మీద వేస్తాం. తప్పు లేదు. మారుతున్న కాలంతో పాటు మార్పు సహజం. మార్పు లేని సమాజం నిర్వీర్యం, నిరర్థకం. ఇవన్నీ చెప్పగలిగే మనం ఈ నీతిని ఎందుకు గ్రహించలేకపోతున్నాం? నేను ఈ రోజు ఇంత ఆవేదనతో నా భాషను తక్కువ చేసుకొని మాట్లాడుతున్నానంటే, అసలు కారణం మీకు తెలియాలి. చెప్తాను. అమెరికాలో తానావారు నాకు సన్మానం చేశాక ప్రపంచదేశాలను పర్యటించి, ఒక తెలుగు బిడ్డగా తెలుగు భాష గొప్పదనాన్ని చాటిరమ్మని నన్ను కోరారు. నేనూ అంగీకరించాను. నాకు ఇతరభాషలు రానందున ప్రపంచంలో చాలా భాషలు మాట్లాడగల ఓ వ్యక్తిని నాకు తోడుగా పంపారు.



పర్యటన మొదలైంది. నాతో వచ్చిన వ్యక్తి నాకు మూగసైగలు చేస్తున్నాడు తప్ప, నోరు విప్పి మాట్లాడడం లేదు. ఒక రోజు గడిచింది. అమెరికా నుంచి ముందు కువైట్‌కు వెళ్లాం. ఈ 'ఒక రోజు'లో నేను ఎవ్వరితోనూ మాట్లాడలేదు. నాతో పాటు నాకు సహాయకుడుగా వచ్చిన వ్యక్తిపై కోపం పట్టలేక, 'నువ్వు ఏం మాట్లాడకుంటే నాకిక్కడి వారి గురించి, ఇక్కడి వాతావరణం గురించి ఎవరు చెబుతారు? నా భాష గొప్పదనం గురించి నేనెవరికి చెప్పాలి?' అని నిలదీశాను. అతనిచ్చిన సమాధానం ఒక్కటే 'అమెరికాలో మీ ప్రసంగం నన్ను మంత్రముగ్ధుడిని చేసింది. మాతృభాషాభిమానమంటే మిమ్మల్నే స్ఫూర్తిగా తీసుకొని నేను నా మాతృభాషను తప్ప మరో భాషను మాట్లాడొద్దని ప్రయాణం తర్వాతే నిర్ణయించుకున్నా. నన్ను క్షమించండి' అని. నేనేం మాట్లాడలేదు, మూగవోయాను. ప్రపంచమంతా మౌనంగానే పరికించాను. తినడానికి తిండి అడుగుదామన్నా వారికి నా భాష తెలియదు. వారి భాష నాకు తెలియదు. సంజ్ఞలతోనే పొట్ట నింపుకున్నా. మనసు చంపుకున్నా. నేను మాట్లాడగలిగికూడా మాట్లాడలేకపోవడానికి కారణం భాష! అని నాకు తెలియకపోవడం. నేనేం తప్పు చేశాను? ఆలోచనల్లోకి వెళ్లిపోయా. తప్పు నాది కాదు, మా నాన్నది! ఆయన భాషాభిమానానిది! మనిషి పుట్టాకే భాష పుట్టింది. మనుగడ కోసం తోచిన పదాలతో ఒక్కొక్కటిగా భాష అభివృద్ధిలోకి వచ్చింది. అది తెలుగైనా, ఆంగ్లమైనా. మనిషి పుట్టాక పుట్టిన భాష మనిషి చావుతో అంతం కాలేదు. కొత్త పుంతలు తొక్కింది. అవసరానికి తగ్గట్టుగా కొత్తకొత్త పదాలు వచ్చి చేరాయి. భాష లేనిదే మన గడ్డను వదిలితే మనుగడ లేదు. ఈ రోజులు ఒకప్పటిలాగా లేవు. ఉనికి కోసం ఊళ్లు దాటి పొమ్మంటున్నాయి. సెలయేళ్లు దాటి, సముద్రాలు దాటి మనుగడ సాగించమంటున్నాయి, ఈ రోజులు. ఇలాంటి రోజుల్లో మడికట్టుకొని ఒకే భాషతో కూర్చుంటే, ఇంట్లో నుంచి బయటికి వెళ్లినా కష్టమే. మన దేశంలోనే ఎన్నో భాషలు... ప్రతి ఒక్కరూ గిరి గీసుకుని కూర్చుంటే, మన భారతావనికి అర్థం లేదు. పక్క రాష్ట్రం సంస్కృతీ సంప్రదాయాలు తెలియవు. ఆధునిక సాంకేతికపరిజ్ఞానం పోకడలు తెలియవు. వాటిని తెలుగుకు అనువదించినా కొన్నిటికి పదాలు వెతుక్కోవల్సిందే. తెలుగులో చదివినా మనం ఇక్కడ కూర్చొని సాధించగలిగింది కొంతే. నా బాధంతా ఏమిటంటే, మనిషి మనుగడకు భాష ముఖ్యం. భావం ముఖ్యం.

అది తెలుగే కానక్కర్లేదు. మనం ఏం చెబుతున్నామో ఎదుటివాడికి అర్థమైతే చాలు. కాలంతో పాటు మారాలి. అలాగని కన్నతల్లి లాంటి మన భాషను [illegible] కాపాడుకోవాలి కానీ, పిడివాదంలా కాదు. [illegible] స్ఫూర్తినిస్తూనే మనుగడ కోసం జరిగే పోరాటంలో ఇతర భాషలకూ చోటివ్వాలి. తప్పదని నా భావన. తప్పుగా మాట్లాడితే క్షమించండి. చివరిగా నేను చెప్పేది ఒకటే మాట... తెలుగు వారందరం అవసరమైన అన్ని భాషలూ నేర్చుకుందాం, మాట్లాడదాం. మన మాతృభాష తెలుగును గౌరవిద్దాం. తెలుగు ఔన్నత్యాన్ని కాపాడదాం...!" కన్నీళ్ల పర్యంతమవుతూనే సుశ్రుత్ చెప్పదలచుకున్నది చెప్పి, నీరసంతో ఒక్కసారిగా కుర్చీలో కూలబడ్డాడు.

నా కళ్లు చూస్తున్నాయి తప్ప, ఏం జరుగుతున్నా పట్టించుకునే స్థితిలో లేదు నా మెదడు... అది మొద్దుబారి చాలా సేపైంది. నిర్వేదంగా శూన్యంలోకి చూస్తున్న నా చెక్కిళ్లు దాటి, ఎన్ని కన్నీళ్లు జారిపోయాయో నాకే తెలియదు. "క్షమించు నాన్నా!" అంటూ నా బిడ్డను కన్నీళ్లతోనే [illegible]...

(సమాప్తం)